


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 05-02-2026 | సంపుటి - 26 | సంచిక -257 | రూ : 4 | పేజీలు: 8

2లో

తెలంగాణలో కొత్త విద్యుత్ కనెక్షన్ల

## జారీలో మార్పులు

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన విద్యుత్ నియంత్రణ మండలి
- గతంలో దూరాన్ని బట్టి ఫీజు వసూలు చేసేవారు
- రేపటి నుంచి ఫిక్స్డ్ ఛార్జీలు వసూలు

కేసీఆర్.. నువ్వెలా

# జాతిపిత అవుతావు?

- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు
- మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం
- బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి



2లో



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో

బీజేపీ తరపున

## పవన్ కల్యాణ్ ప్రచారం

- పవన్ కల్యాణ్ ను కలిసిన కిషన్ రెడ్డి, రాంచందర్ రావు
- బీజేపీకి పవన్ మద్దతు ప్రకటించారన్న రాంచందర్ రావు
- బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారని వెల్లడి

2లో



2లో

## తెలుగు రాష్ట్రాల్లో..

## భారీగా ఎయిడ్స్ మరణాలు

**ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ**

- 2020-24 మధ్య కాలంలో ఎయిడ్స్ కారణంగా దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది మృతి
- ఏపీలో 32,642 మంది... తెలంగాణలో 11,498 మంది మృతి
- విదేశీ తరహా జీవనశైలి వల్ల ఐటీ రంగంలో విస్తరిస్తున్న వైరస్

రెండున్నర గంటలపాటు సాగిన

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం

- ముగిసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భేటీ
- వైసీపీ కుట్రలు, కూటమి సమన్వయంపై ప్రధానంగా చర్చ
- రాజ్యసభ స్థానాలు, నామినేటెడ్ పదవుల భర్తీపై సమాలోచనలు
- క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం



2లో




2లో

2.5 కోట్ల ఆధార్ కార్డులను

## డీయాక్టివేట్ చేసిన కేంద్రం

- గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్ల మంది ఆధార్ నంబర్ల రద్దు
- పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- ఆధార్ భద్రతకు బయోమెట్రిక్ లాక్, ఫేస్ అథెంటికేషన్ ఫీచర్లు
- డేటాబేస్ శుద్ధీకరణలో భాగంగా యూఐడీఏఐ ఈ నిర్ణయం

మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు..

# కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎం

- వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం
- ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు
- రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం
- బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- 6 జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్



2లో

## వండర్ హాట్ మిర్చికి రికార్డు ధర

- క్వింటాకు రూ.39,000
- ఈ సీజన్‌లో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అత్యధిక రేటు



2లో

ఏ సి బి కి చిక్కిన..

# కూకట్ పల్లి ఎస్ ఈ



2లో

- రు.15 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్ గ పట్టుకున్న అధికారులు
- బిల్లుల విడుదల కు రూ. 40 లక్షల డిమాండ్ చేసిన చిన్నారెడ్డి

# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు... కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు

అమరావతి: వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రెన్యూర్లు), ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ (SASKI) నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ (APAR) ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణలో కొత్త విద్యుత్ కనెక్షన్ల
## జారీలో మార్పులు

హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో రేపటి నుంచి భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇందుకోసం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో స్తంభాలు, లైన్స్ కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో విధంగా ఫీజు వసూలు చేసేవారు. రేపటి నుంచి ఫిక్స్డ్ ఛార్జీలు ఉండనున్నాయి. గృహ విద్యుత్ కనెక్షన్లకు 1 కిలో వాట్ వరకు రూ.500 వరకు వసూలు చేస్తారు. 1 కిలో వాట్ నుంచి 5 కేవీ వరకు రూ.500 వసూలు చేస్తారు. ఆపై ప్రతి అదనపు కిలో వాట్‌కు రూ.600 చొప్పున వసూలు చేస్తారు. 5 కిలో వాట్ల నుంచి 20 కిలో వాట్ల వరకు రూ.2,900 వసూలు చేస్తారు. అక్కడ్నించి ప్రతి అదనపు కిలో వాట్‌కు రూ.1,500 చొప్పున వసూలు చేస్తారు. 20 కిలో వాట్లు ఆ పైన.. రూ.10,000 వసూలు చేయనున్నారు. వాణిజ్య కనెక్షన్లు అయితే 1 కిలో వాట్ వరకు రూ.1,000 వసూలు చేస్తారు.

# ఏసిబికి చిక్కిన కూకట్ పల్లి ఎస్ఈ

(ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి) : ఏసిబి అధికారుల చేతికి కూకట్ పల్లి లో అవినీతి తిమింగలం చిక్కింది. నేడు కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సూపరిండెంట్ ఇంజినీర్ పి.చిన్నా రెడ్డి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకి చిక్కాడు. ఏసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్ పల్లి జోనల్ కమిషనర్ పరిధిలోని అల్వాల్, కూకట్ పల్లి, మూసాపేట్ సర్కిళ్లలోని చెరువులలో గుర్రపుడెక్క, పూడికతీత పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్ తనకు రావలసిన బిల్లుల కోసం సూపరిండెంట్ ఇంజినీర్ పి.చిన్నా రెడ్డిని సంప్రదించి తనకు రావలసిన కోటి 40 లక్షల రూపాయల బిల్లులను విడుదల చేయమని విజ్ఞప్తి చేశాడు. ఆ మొత్తాన్ని విడుదల చేసేందుకు తనకు 40 లక్షల రూపాయలు లంచం ఇవ్వాలని చిన్నా రెడ్డి డిమాండ్ చేయగా తాను అంత ఇచ్చుకోలేనని కాంట్రాక్టర్ తెలపటంతో 30 లక్షలకు తగ్గేది లేదని చిన్నా రెడ్డి తెలుపగా, తాను 30 లక్షలు సైతం ఒకే సారి ఇచ్చుకోలేనని విడతల వారిగా ఇచ్చేందుకు కాంట్రాక్టర్ సుముఖత వ్యక్తం చేశాడు. ఆ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులకి ఫిర్యాదు చేయటంతో నేడు మొదటి విడతగా 15 లక్షల రూపాయలు, చిన్నా రెడ్డి వద్ద కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న ప్రవీణ్ చేతికి అందజేస్తుండగా, ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రంగారెడ్డి రేంజ్ ఏసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

## రెండున్నర గంటలపాటు సాగిన
## చంద్రబాబు, పవన్ సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. నిన్న కేబినెట్ భేటీకి ముందు చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# 14 వార్డులు ఏకగ్రీవం

హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో 14 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డులకు సంబంధించి నామినేషన్ల తుది వివరాలను ఎన్నికల సంఘం అధికారులు బుధవారం వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా 12 వార్డులను కైవసం చేసుకోగా, రెండు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్లో ఒకటి, కోదాడలో మూడు వార్డులు, వికారాబాద్ మున్సిపాల్టీలో రెండు వార్డుల్లో ఏకగ్రీవ ఫలితాలొచ్చాయి. మహబూబ్ నగర్, రామగుండం కార్పొరేషన్లలో ఒకటి చొప్పున, యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండు ఏకగ్రీవమయ్యాయి.



1).ఆలంపూర్, 10వవార్డు, పి. విక్రమ్ బీఆర్ఎస్
2).చౌటుప్పల్ ,17వవార్డు, చింతల ఉమామహేశ్వరి (కాంగ్రెస్)
3).ఎదులాపురం, 15వ వార్డు , తమ్మినేని మంగతాయి (కాంగ్రెస్)
4).హాలియా, 10వార్డు చంద్రకళ పిల్లి (కాంగ్రెస్)
5).హుజూర్ నగర్, 3వ వార్డు (బీసీ మహిళ) ఎస్. నాగలక్ష్మి (కాంగ్రెస్) ఏకగ్రీవం
6).కోదాడ, 11వ వార్డు దేవరపల్లి మల్లేశ్వరి (కాంగ్రెస్)
7).కోదాడ, 21వార్డు, కట్టెబోయిన జ్యోతి (కాంగ్రెస్)
8).కోదాడ, 31 వార్డు, యెర్నేని కుసుమ కుమారి (కాంగ్రెస్)
9).మహబూబ్ నగర్ కార్పొరేషన్, 58వ వార్డు, బి. రమాదేవి (కాంగ్రెస్)
10) మెదక్, 32వవార్డు, జి. మానస (కాంగ్రెస్)
11).రామగుండం కార్పొరేషన్, ఒకటోవార్డు, మడిపెల్లి విజయ (కాంగ్రెస్)
12).వికారాబాద్, ఒకటోవార్డు, అనంత్ రెడ్డి పటోల్ల (కాంగ్రెస్)
13).వికారాబాద్, 15వవార్డు, పి. విజయలక్ష్మి (బీఆర్ఎస్)
14).యాదగిరిగుట్ట, పదోవార్డు గుండ్లపల్లి వాణి (కాంగ్రెస్)

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..
## ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 20202024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది. ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.

# కేసీఆర్.. నువ్వెలా జాతిపిత అవుతావు?: రేవంత్ రెడ్డి

హైదరాబాద్:"భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వెలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లు*, సన్నాసి, దొంగ అయిన నువ్వెలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు. తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

*** స్థానిక నేతపై విమర్శలు, అభివృద్ధి పనులకు శ్రీకారం**

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

*** ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## 2.5 కోట్ల ఆధార్ కార్డులను
## డీయాక్టివేట్ చేసిన కేంద్రం

ఢిల్లీ:గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈకేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున పవన్ కల్యాణ్ ప్రచారం

హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల హడావుడి జోరందుకుంది. అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వీలైనన్ని ఎక్కువ స్థానాలను గెలుచుకునే లక్ష్యంతో వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ తరుణంలో బీజేపీ కీలక ప్రకటన చేసింది. బీజేపీకి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మద్దతు ప్రకటించారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రకటించారు. పవన్ కల్యాణ్ తో తాను, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయినట్టు రాంచందర్ రావు ఎక్స్ వేదికగా తెలిపారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలతో పాటు పలు కీలక అంశాలపై తమ మధ్య చర్చ జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి పవన్ పూర్తి మద్దతు ప్రకటించారని... బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారని పేర్కొన్నారు. పవన్ మద్దతు తెలంగాణ బీజేపీకి తిరుగులేని బలాన్ని, వేగాన్ని ఇస్తుందని అన్నారు.

# వండర్ హాట్ మిర్చికి రికార్డు ధర

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వండర్ హాట్ మిర్చికి క్వింటాకు రూ.39,000 రికార్డు ధర పలికింది. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం నీలంపల్లి గ్రామానికి చెందిన వినోద్ అనే రైతు బుధవారం 8బస్తాల వండర్ హాట్ మిర్చిని ఏనుమాముల మార్కెట్‌కు తీసుకురాగా భాగ్యలక్ష్మి ఖరీదు ద్వారా కీర్తన అడ్తి వ్యాపారి అత్యధికంగా క్వింటాకు రూ.37,100 ధర పెట్టి కొనుగోలు చేశారు. 2022లో వండర్ హాట్ మిర్చికి క్వింటాకు రూ.39,000 ధర పలకగా నాలుగేండ్ల అనంతరం ఈ సీజన్‌లో మొదటిసారి వండర్ హాట్ మిర్చికి అత్యధిక ధర పలకడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, బుధవారం మార్కెట్‌కు వివిధ రకాలకు చెందిన 5వేల మిర్చి బస్తాలు వచ్చాయి. ఇందులో తేజ రకం మిర్చి బస్తాలు 2000 వరకు రాగా.. గరిష్ట ధర రూ.19,600, కనిష్ట ధర రూ.12,000, మోడల్ ధర రూ.17,500 పలికింది. వండర్ హాట్ మిర్చి 150 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.37,100, కనిష్ట ధర రూ.15,000, మోడల్ ధర రూ.30,000 వచ్చింది. యూఎస్ 341 రకం మిర్చి 2200 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.26,200, కనిష్ట ధర రూ.12,500, మోడల్ ధర రూ.23,000 పలికింది. దీపిక రకం మిర్చి 50 బస్తాలు రాగా ధర రూ.30,000 పలికింది. యెల్లో రకం మిర్చి 10బస్తాలు రాగా ధర రూ.37,500 పడింది. తాలు 200 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.11,000, కనిష్ట ధర రూ.5000, మోడల్ ధర రూ.7500 పలికింది.

# అక్షరమే ఆయుధంగా పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరం

* అక్షరమే ఆయుధంగా పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరం
* శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : అక్షరమే ఆయుధంగా క్షేత్రస్థాయిలో పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ, అకాడమి ప్రచురించిన చిరుపుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావుతో కలిసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ మాట్లాడుతూ మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నాం అనే భరోసా ఇచ్చి వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమం అభినందనీయం అని అన్నారు. మరణించిన జర్నలిస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు మంజూరు చేయడంతోపాటు అయిదు సంవత్సరాల పాటు పెన్షన్





సదుపాయం కల్పించడం మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. పాత్రికేయ రంగంలో అనేక సంవత్సరాలు సేవలందించిన ప్రముఖ జర్నలిస్టు జీవిత విశేశాలు తెలిపే చిరు పుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరించడం వలన రాబోయే తరాలకు స్పూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. నేటి సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా తను నేను మాత్రం పత్రికలు చదివితినే సంతృప్తి చేందుతానని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. విద్యా, ప్రజా వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు కె. కేశవ రావు మాట్లాడుతూ ప్రముఖుల చరిత్ర తెలిపే పుస్తకం చదవడం సులభం. కాని అదే చరిత్ర ను మోనోగ్రాఫ్ గా అందించడం మాటలు కాదు. అది అక్షర రూపం దాల్చడంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమాజానికి అద్దం పట్టేది వార్త అయితే ఆ వార్త వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసిన జర్నలిస్ట్ భవిష్యత్తు తరాలకు దారి చూపిన వారవుతారు. సోషల్ మీడియా ను కంట్రోల్ చేయడం ఎవరి తరం కాదన్నారు. కానీ దీనిపై మన జర్నలిస్టులందరూ ఎకతాటిపై వచ్చి చర్చించడం లేదా వర్క్ షాప్ లు నిర్వహించి కొంత మార్పుకు నాంది పలకాలన్నారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చనిపోయిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ, ప్రమాదానికి గురైన జర్నలిస్టులకు 50 వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేసినట్లు ఆయన వివరించారు. ప్రముఖ పాత్రికేయులైన . అబిద్ అలీఖాన్,. డి. సీతారాం, బేతనబొట్ల నాగేశ్వరరావు, పొత్తూరి వెంకటేశ్వరరావు,.ఎం.ఎస్. ఆచార్య,ఎ.బి.కె. ప్రసాద్,.జి.ఎస్. వరదాచారి,. సి.రాఘవాచారి, .వి.హనుమంతరావు, ఆదిరాజు వెంకటేశ్వరరావులపై మీడియా అకాడమి ప్రచురించిన 10 చిరుపుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, సీనియర్ జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన చూసి ఓర్వలేకనే..

* బురద చల్లే ప్రయత్నం:
* కేసిఆర్ దిష్టిబొమ్మ దహనం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజా పాలనను చూసి ఓర్వలేకనే.. సీఎం రేవంత్ రెడ్డిపై బురద చల్లని ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండె నరసింహ అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా కొండె నరసింహ మాట్లాడుతూ ఫోన్ టాపింగ్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. కానీ, బిఆర్ఎస్ నాయకులు మాత్రం రేవంత్ రెడ్డి ప్రజాపాలనను చూస్తూ ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బిఆర్ఎస్ నాయకులు దహనం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. అందుకు నిరసనగా కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ వెంకట్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ సంపత్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కడగంచి వెంకటేష్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు కడగంచి జనార్ధన్, రామాలయం దేవస్థానం మాజీ చైర్మన్ జాజుల అంజయ్య, బర్రె నరసింహ, బోయ నరసింహ, మాధగోని అంజయ్య, బీర్ల యాదయ్య , అంతటి రవి, నామ రాములు, రత్నం గాలిం, చేగురి బాబు, కడగంచి అన్వేష్, తూర్పింటి వంశీ, బోయ నవీన్, బోయ వంశీ, బోయ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


## అడ్వకేట్ హత్యా ఘటనతో ఉలిక్కిపడ్డ మొహినాబాద్..

* యువ న్యాయవాది దారుణ హత్య
* చేవెళ్ల కోర్టును బైకాట్ చేసిన న్యాయవాదులు




మొహినాబాద్, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి జిల్లా మోహినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామం శివారులో యువ న్యాయవాది స్వప్న దారుణ హత్యకు గురికావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. స్వప్న (34) అనే యువ న్యాయవాదిని హత్య చేసిన ఘటన న్యాయవాద వర్గాల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. హత్యకు గురైన స్వప్న మృతదేహం ప్రస్తుతం భాస్కర ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తూ చేవెళ్ల కోర్టును న్యాయవాదులు బైకాట్ చేశారు. న్యాయవాదుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. "న్యాయవాదికే న్యాయం లేకపోతే, సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి?" అంటూ న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని, న్యాయవాదులకు తగిన భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటన, ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది, పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

## ఎల్లమ్మ చెరువును పరిశీలించిన హైడ్రా కమీషనర్ ఎ.వి.రంగనాథ్



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువును బుధవారం హైడ్రా కమీషనర్ ఎ.వి. రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ భవ్యస్ ఆనంద్ ప్రసాద్ తో కలిసి మర్యాదపూర్వంకంగా కలిసి ఎల్లమ్మ చెరువు ుందరికరణ పనుల గురించి , ఎల్లమ్మ చెరువుకు ప్రక్కన మాధవినగర్ నుండి జయనగర్ వరకు ఉన్న మట్టి రోడ్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి కమీషనర్ కి వివరించి, వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, ప్రదీప్ రెడ్డి, కాశినాథ్ యాదవ్, గోపాల్, శిరీష సత్తూర్, షౌకత్ అలీ మున్నా, లింగం, సుధాకర్, సత్తయ్య, ఖలీమ్, శ్రీను, భవ్యస్ తులసీవనం వాసులు, ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పాలకురాలిగా కాదు.. సేవకురాలిగా పనిచేస్తా

: రావుల వసంతస్వామి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పాలకురాలిగా కాదు.. ప్రజలకు సేవకురాలిగా పనిచేస్తానని 6వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రావుల వసంతస్వామి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం 6వ వార్డులో ఎన్నికల వార్డు ఇంచార్జ్, దేవలమ్మ నాగారం సర్పంచ్ సురుగు గౌరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మహిళలతో వార్డులో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. చెయ్యి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రావుల వసంత స్వామి మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తే.. ఐదేళ్లలో ఊహించని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేతరాజు అచ్చయ్య, అరిగె వీరస్వామి, కేతరాజు రాజు, కద్దాల చంద్రయ్య, కేతరాజు వెంకటయ్య, అరిగె రమేష్, కేతరాజు జంగయ్య, చేగూరి మల్లేశం, కేతురాజు నరసింహ, రావుల అంజయ్య, రావుల శేఖర్, రావుల ఊషయ్య, రావుల రవి, ఇంద్రపాల్, రావుల రాజేశ్వరి, రావుల వినోద తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ పాఠశాలలో ఘనంగా 'ఈకిడ్స్ న్యూట్రి క్వెస్ట్ – మాస్టర్ చెఫ్'

ప్రజా స్ఫూర్తి,పాల్వంచ: నెహ్రూ నగర్‌లోని నారాయణ పాఠశాలలో బుధవారం 'ఈకిడ్స్ న్యూట్రి క్వెస్ట్ - మాస్టర్ చెఫ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డా. వి. ప్రవీణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నుంచి పన్నెండు సంవత్సరాల వయస్సులో తీసుకునే పోషకాహారం భవిష్యత్తులో ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలపై అవగాహన కల్పించే ఈ కార్యక్రమం ప్రశంసనీయమని అన్నారు. ఈకిడ్స్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే స్లైసో మంత్, న్యూట్రిడీల్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తినే అలవాటు పెంచుతున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు మాట్లాడుతూ పాఠశాలలో జంక్ ఫుడ్‌ను పూర్తిగా నిషేధించామని, 'వాటర్ బెల్' విధానం ద్వారా విద్యార్థులు క్రమం తప్పకుండా నీరు తాగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మాస్టర్ చెఫ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేసి, పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో పాఠశాల సిబ్బంది సమన్వయం అభినందనీయమని ఏజీఎం రాంకి పేర్కొన్నారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

* 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇప్ప వెంకటేష్




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తానని 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇప్ప వెంకటేష్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం 4వ వార్డులో ఎన్నికల వార్డు ఇంచార్జ్ చెన్నగోని అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు, యువత, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా ఇప్ప వెంకటేష్ మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానన్నారు. ఆదరించి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి నిరూపించుకుంటానన్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి తన గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దైద మోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బాలగోని వెంకటేశం, ఎస్ లింగోటం గ్రామ శాఖ అధ్యక్షుడు చేవెళ్లి శివకృష్ణ, వార్డు అధ్యక్షుడు చీకూరి యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ఊదరి మహేష్, నాయకులు బత్తుల లింగస్వామి గౌడ్, సామకూర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

: అంతటి విజయలక్ష్మి బాలరాజు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తనని ఆదరించి కౌన్సిలర్ గా గెలిపిస్తే.. వార్డును అన్ని రంగాలు అభివృద్ధి చేసి చూపిస్తానని 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి అంతటి విజయలక్ష్మి బాలరాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లిలోని 15వ వార్డులో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వార్డు ఎన్నికల ఇంచార్జ్ అర్థ వెంకట్ రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలు, వృద్ధులను కలుస్తూ తమ అమూల్యమైన ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా అంతటి విజయలక్ష్మి బాలరాజు మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో 15వ వార్డు కౌన్సిలర్ గా బరిలోకి దిగానన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ వార్డు సమగ్ర అభివృద్ధి చేయంగా పనిచేస్తానన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే.. ఐదేళ్ల కాలంలో ప్రజలకు సేవకురాలిగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు అధ్యక్షుడు ఊదరి సురేష్, ఎస్సీ సెల్ మున్సిపల్ అధ్యక్షుడు బొజ్జ బుచ్చయ్య, సిపిఐ నాయకుడు దాసరి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బెడిదం లింగస్వామి, మారగోని శ్రీను, కొమ్ము సుధ, సిలివేరు చంద్రకాంత్, ఎండి సోహెల్, దాసరి చంద్రయ్య, ఊదరి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఒక పదం మాత్రమే, అది మీ జీవిత వాక్యం కాదు. ధైర్యంగా పోరాడండి

* మియాపూర్ సీనియర్ నాయకులు అట్టేపల్లి రామప్రభు





శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ లో ప్రజారోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో అట్టేపల్లి లక్ష్మీనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో బీపీ,షుగర్,ఈసీజీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ , స్థానిక నాయకుడు అట్టేపల్లి రామప్రభు స్వయంగా ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. ఒమేగా హాస్పిటల్స్ డాక్టర్ వెంకటేశ్వర కుమార్,డాక్టర్ గౌతమ్, డాక్టర్ హరీష్, హాస్పిటల్ సిబ్బంది మరియు డంజా క్యాన్సర్ సెంటర్ నుండి వచ్చిన ప్రముఖ వైద్యులు భాస్కర్ క్యాన్సర్ నివారణ పద్ధతులు , అధునాతన చికిత్సల గురించి ప్రజలకు వివరించారు, మియాపూర్‌లోని ప్రతి పౌరునికి నాణ్యమైన వైద్య సమాచారం అందాలనేదే తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి రామప్రభు టీమ్ సభ్యులు , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన కార్యక్రమం విజయవంతం చేశారు.

## మున్సిపల్ ఎన్నికలు
# ప్రశాంతంగా నిర్వహించాలి
**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులతో బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఇందుకోసం 8 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 4 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలలో ఈ నెల 11న పోలింగ్ జరగనున్నదని తెలిపారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 101 పోలింగ్ స్థానాల్లో 288 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటిలో 148 సాధారణ, 125 సున్నితమైన, 15 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు.అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమతులతోనే ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనుమతులు లేకుండా ప్రచారం చేస్తే ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభపరిచే విధంగా నగదు, మద్యం, ఇతర సామగ్రి అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కొత్తగూడెం 1టౌన్ సీఐ కరుణాకర్, 2టౌన్ సీఐ ప్రతాప్, 3టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి, పాల్వంచ సీఐ సతీష్, ఇల్లందు సీఐ సురేష్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి
# నిరుపేదల పాలిట వరం
*** కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్**



కూకట్ పల్లి , ప్రజాస్ఫూర్తి : సీఎం సహయ నిధి నిరుపేదల పాలిటా వరమని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ లో నివాసం ఉంటున్న ఖాజా మియా వయస్సు(60)సంవత్సరాలు కిడ్నీ సమస్యతో పూజా ఆసుపత్రిలో హాస్పిటల్ లో చేరడం జరిగింది.హైదర్ నగర్ లో నివాసముండే ఎండి. ఫయాజ్ ను ఖాజామియా కుమారులు వారి కార్యాలయంలో సంప్రదించగా వారికి శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిది కి అప్లై చేయడంతో వారికి 52500/హ రూపాయల సీఎంఆర్ఎఫ్ మంజూరు అయ్యింది.ఆ సీఎంఆర్ఎఫ్ చెక్కును శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా ఖాజా మియాకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాజామియా సీఎం రేవంత్ రెడ్డి వి.జగదీశ్వర్ గౌడ్ ఎండి ఫయాజ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాజిద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీ మెట్రో ఒప్పందాలపై
# నిర్మాణ సంస్థకు హైకోర్టు ఆదేశాలు



పాతబస్తీలో మెట్రో నిర్మాణం వల్ల చారిత్రక కట్టడాలు దెబ్బతింటున్నాయని యాక్ట్ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. మెట్రో నిర్మాణానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కుదిరిన ఒప్పందాల వివరాలను మూడు వారాల్లో అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని మెట్రో నిర్మాణ సంస్థను హైకోర్టు ఆదేశించింది. వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీ ఏర్పాటు అంశాన్ని కూడా అఫిడవిట్‌లో పేర్కొనాలని సూచించింది. మెట్రో సంస్థ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, కేవలం మూడు పురాతన కట్టడాలు మాత్రమే ప్రభావితమవుతాయని వివరించారు. వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీ ఇప్పటివరకు ఏర్పాటు కాలేదని పిటిషనర్ తరపు అడ్వకేట్ వాదనలు వినిపించారు. ఆ ప్రక్రియ కొనసాగుతోందని ఏఏజీ కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఆదరించి ఆశీర్వదిస్తే.. అద్దంలా అభివృద్ధి చేస్తా

*** బత్తుల వాణీ విప్లవ్ కుమార్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కౌన్సిలర్ గా తనను ఆదరించి ఆశీర్వదించి గెలిపిస్తే.. 13వ వార్డును అద్దంలో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బత్తుల వాణీ విప్లవ్ కుమార్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డులో బుధవారం ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. వలిగొండ రోడ్డు నుంచి మహిళలతో భారీ ర్యాలీగా సర్వీస్ రోడ్డు వెంట ఓటర్లను కలుస్తూ భాస్కర్ టాకీస్ వద్దకు చేరుకున్నారు. రాంనగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. రాంనగర్ నుంచి కృష్ణానగర్ మీదుగా కోర్టు రోడ్డు వెంట వెంకటరమణ కాలనీ, పద్మశాలి కాలనీల మీదుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంనగర్ కాలనీ సెంటర్ లో కాంగ్రెస్ పార్టీ 13వ కౌన్సిలర్ అభ్యర్థి బత్తుల వాణి విప్లవ్ కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయన్నారు. 13వ వార్డు ప్రాంత ప్రజలకు సేవకురాలిగా పనిచేస్తానన్నారు. వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా బరిలోకి దిగానని, వార్డు ప్రజలు చేతి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో 13వ వార్డు ఎన్నికల ఇన్చార్జ్ ఈద్దుల మస్తాన్ బాబు, నాయకులు మార్గం నరసింహ యాదవ్, వర్కాల కుమార్ గౌడ్, చెవగోని వెంకటేష్ గౌడ్, మొగుదాల రాములు, బొమ్మిరెడ్డి సంజీవరెడ్డి, గూయని జంగయ్య, మల్కాపురం గ్రామశాఖ అధ్యక్షుడు సుక్క రవీందర్, వార్డు మెంబర్ పక్కిరు వంశీదర్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్లు కంచర్ల అశ్విన్ రెడ్డి, దేప శ్యాంసుందర్ ముదిరాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శివ కుమార్ గౌడ్, ఈద్దుల కేశవ్, దౌడి లింగస్వామి సిల్వేరు సాయి, మహంకాళి పృథ్వీ, జొన్నగంటి సుర్యం, బోయిని రామ్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

**: కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : తరగతి గదిలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, బయట ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు ఆలోచించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడానికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం కీలకమని అన్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న “ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్” బూట్ క్యాంప్‌ను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపే ప్రాజెక్టులు రూపొందించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ బూట్ క్యాంప్ ద్వారా ఉపాధ్యాయులు పొందిన అనుభవాన్ని విద్యార్థులకు అందించి వారి నవకల్పనలను ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థుల ఆవిష్కరణలను ఉత్పత్తులుగా అభివృద్ధి చేయడంలో వాద్వానీ ఫౌండేషన్,కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ,పీఎం శ్రీ పాఠశాలలు భాగస్వామ్యంగా పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ ప్రతినిధి విభం వ్యాస్, వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి శ్యామ్, డాక్టర్ హెచ్. శ్రీనివాస్ వరప్రసాద్, అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ భరత్ కృష్ణ, ప్రిన్సిపాల్ రవికుమార్, జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్‌తో పాటు పలు జిల్లాల నుండి పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణలు వెంటనే జారీ చేయాలి

*** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

మేడ్చల్ ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల కు చెందిన 9, 10వ తరగతి విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్లు అందించేందుకు అవసరమైన కుల, ధృవీకరణ పత్రాల నమోదు విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, డిఈఓ విజయ కుమారి, ఎల్డిఎం శివ ప్రసాద్ లతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు కోసం ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణలు వెంటనే జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.ఈ ప్రక్రియలో నమోదు నుండి జారీ వరకు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, అదే విధంగా సంబంధిత తహసీల్దార్లతో సంప్రదించి ధృవపత్రాల జారీలో జాప్యం జరుగకుండా చూడాలని తెలిపారు. విద్యార్థులకు బ్యాంకు అకౌంట్, పోస్టల్ అకౌంట్ తెరిపించడంలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ముందుగా జాప్యంలేకుండా స్థానిక విద్యార్థుల కుల, ఆదాయ ధృవీకరణలు పెండింగ్ లో లేకుండా చూడాలని అదేశించారు. పోస్టాఫీస్ లో 10 సంవత్సరాలు నిండిన విద్యార్థుల పేరు మీద వంద రూపాలయలతో అకౌంట్ ఓపెన్ చేసి స్కాలర్ షిప్ కొరకు అకౌంట్ వివరాలు అనుసంధానం చేయాలని, ఈ అకౌంట్ తెరవడానికి ఆధార్, ఫోన్ నంబరు ఉంటే చాలని వివరించారు. జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ని షెడ్యూల్డ్ కులాల కు చెందిన 9, 10వతరగతి విద్యార్థులు అర్హులు , కుటుంబ ఆదాయం రూ. 2.5 లక్షల లోపు ఉండాలాన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణలతో పాటు బోనఫైడ్, పాస్ పోర్టు సైజ్ ఫోటో బ్యాంక్ అకౌంట్/ పోస్టల్ అకౌంట్ కలిగి ఉన్న విద్యార్థులుఈ పాస్ వెబ్ సైట్ https://www.tgepass.cgg.gov.in నందు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల సందేహాలకు అదనపు కలెక్టర్ సలహాలు, సూచనలు అందించారు.

# బడ్జెట్ పాఠశాలలను కార్పొరేట్ ఫిజులతో చూడొద్దు

*** ట్రస్మా అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి**



మేడ్చల్ , ప్రజాస్ఫూర్తి : బడ్జెట్ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలతో పోల్చి చూడవద్దని తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ట్రస్మా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యవర్గ సమావేశం ఓల్డ్ బోయిన్పల్లి లోని గ్రీన్ వుడ్ పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఫీజు రెగ్యులేషన్ కమిటీని తీసుకురావడంలో తప్పు లేదని కానీ కార్పొరేట్ ఫీజులను పరిగణలోకి తీసుకోవడమే బాధాకరమన్నారు. సామాన్యుల పిల్లలంతా బడ్జెట్ పాఠశాలల్లోనే చదువుతున్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇక్కడి పాఠశాలల్లో ఫీజులు అత్యధికంగా ఉండవని గుర్తు చేశారు. ప్రొఫెషనల్ టాక్స్, ట్రేడ్ టాక్స్ పేరుట ఇబ్బందులకు గురి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. సమాచార హక్కు చట్టం పేరుతో, విద్యార్థి సంఘాల పేరుతో, ఇతర సంఘాల పేర్లతో పాఠశాలల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారి నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం దృష్టి సారించకపోతే ఆందోళనకు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ ను, విద్యా సంస్థలకు సంబంధించిన పూర్తిస్థాయి జీవోలతో రూపొందించిన డైరీ ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు, బాలానగర్ మండల అధ్యక్షులు రమేష్ రెడ్డి, జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా బాధ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నితిన్ నబిన్ సిన్హా కు ఘన స్వాగతం పలికిన బీజేపీ నేతలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా బుధవారం కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వినర్ జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట నుండి భారీ ఎత్తున వారికి ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోజిల్లా ఇన్చార్జి అధ్యక్షులు మల్లారెడ్డి , ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందన దివాకర్ , సురేష్ రెడ్డి , సిద్ధిరాం రెడ్డి , వేణు , చక్రి , ప్రసాద్ , పరుష వేణు తదితరులు పాల్గొన్నారు

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నెక్స్ట్ ఏంటి..! సిట్ సభ్యులతో సజ్జనార్ భేటీ


రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే పలువురు అధికారులను ప్రశ్నించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), ఇప్పుడు తుది అడుగులు వేస్తోంది. డిసెంబర్ నుంచి సిట్ విచారణ వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో దర్యాప్తును నెల రోజుల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయినట్లుగా సమాచారం. దర్యాప్తు పురోగతిని సమీక్షించేందుకు సిట్ చీఫ్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సిట్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు సేకరించిన ఎలక్ట్రానిక్ ఆధారాలు, కాల్ డేటా రికార్డులు (CDR), సర్వర్ లాగ్‌లు, సీజ్ చేసిన పరికరాల ఫోరెన్సిక్ నివేదికలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిసింది. ఇంకా పెండింగ్‌లో ఉన్న సాక్ష్యాల సేకరణ, కీలక వ్యక్తుల స్టేట్‌మెంట్‌ల రికార్డింగ్‌ను వేగవంతం చేయాలని సూచనలు ఇచ్చారు. కేసులో ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు అధికారుల పాత్రపై స్పష్టతకు రావడమే కాకుండా, ఆ ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయనే అంశంపై కూడా సిట్ దృష్టి సారించింది. చార్జ్‌షీట్ దాఖలు, డిపార్ట్‌మెంటల్ చర్యలు, సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసుల కొనసాగింపు వంటి అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. దర్యాప్తు గడువును కట్టుదిట్టంగా పాటించాలని, ఎటువంటి లోపాలు లేకుండా తుది నివేదిక సిద్ధం చేయాలని సిట్ చీఫ్ సూచించారు.ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ వర్గాల్లోనూ ఉత్కంఠ నెలకొంది. కేసు తుది దశకు చేరుతుండటంతో రాబోయే రోజుల్లో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలపై సీపీ చర్చించినట్లు తెలుస్తోంది.

# విమానం ఇంజిన్‌లో మంటలు.. కోల్‌కతా ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్

తుర్కియేకు చెందిన ఓ విమానానికి తీవ్ర సమస్య తలెత్తింది. కాఠ్‌మాండు నుంచి తుర్కియే బయలుదేరిన కొద్ది సేపటికే ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. దీన్ని గమనించిన పైలట్ కోల్‌కతా ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఘటన సమయంలో విమానంలో 236 మంది ప్రయాణికులు ఉన్నారని, వారంతా సురక్షితమేనని




అధికారులు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం కాఠ్‌మాండు నుంచి ఇస్తాంబుల్ బయలుదేరిన తుర్కియే ఎయిర్‌లైన్స్ విమానం.. గాల్లోకి ఎగిరిన నాలుగు నిమిషాలకే కుడి వైపు ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. దీన్ని గమనించిన పైలట్.. వెంటనే ఆ ఇంజిన్‌ను నిలిపివేశారు. ఈ విషయాన్ని కాఠ్‌మాండు టవర్‌కు చేరవేసి, పరిస్థితి అంచనా వేస్తూ సింగిల్ ఇంజిన్‌తోనే కొద్దిసేపు గాల్లోనే చక్కర్లు కొట్టించారు. అనంతరం సుదీర్ఘ ప్రయాణం సురక్షితం కాదని భావించి.. కోల్‌కతాలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. పైలట్ నుంచి 'ప్యాన్ ప్యాన్' సిగ్నల్ రాగానే.. నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకున్నట్లు పౌర విమానయానశాఖ వెల్లడించింది. 'ప్యాన్ ప్యాన్' అనేది విమానంలో అత్యవసర పరిస్థితిని సూచించే రేడియో డిస్ట్రెస్ కాల్. అయితే, 'మేడే' కాల్ అంత తీవ్రమైనది కాదు. గగనతలంలో ఇంజిన్ వైఫల్యం తలెత్తినప్పుడు పైలట్ ఈ ఎమర్జెన్సీ మెసేజ్‌ను పంపిస్తారు. పరిస్థితి అత్యంత తీవ్రమైనది కానప్పటికీ.. క్లిష్టమైనది అని చెప్పేందుకు ఈ మెసేజ్ ఇస్తారు. రెండు ఇంజిన్ల విమానాల్లో ఒకటి విఫలమైనప్పుడు, తదితర సందర్భాల్లో ఈ సందేశం పంపిస్తారు.



## సర్‌ను అలా మార్చొద్దు
# రాజ్యసభలో కమల్ హాసన్

తమిళనాడులో కొనసాగుతోన్న ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు కమల్ హాసన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా రాజ్యసభలో మాట్లాడిన ఆయన ఎన్నికల సంఘం రాష్ట్ర ఓటర్ల హక్కులను తనిఖీ చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ''రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల గురించే నా ఆందోళన. దాన్ని అక్షరదోషాలు తనిఖీ చేసే ప్రక్రియగా భావిస్తున్నా. ఓటు ప్రాథమిక హక్కు. ఎన్నికల కమిషన్ మాత్రం మా హక్కును తనిఖీ చేస్తోంది. జాబితా పరిశీలనల్లో అనేక తప్పిదాలు జరుగుతున్నాయి. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు కోటి మంది అర్హులైన ఓటర్లు చనిపోయినవారి జాబితాలో ఉండవచ్చని ఆందోళన చెందుతున్నాం. బిహార్‌లో బతికున్న వారిని చనిపోయిన వారి ఓటర్ల జాబితాలో చేర్చారు. అటువంటి పరిస్థితి దేశమంతటా వ్యాప్తి చేయొద్దని కోరుకుంటున్నాం'' అని అన్నారు. భాష గురించి మాట్లాడిన కమల్.. తనకు తమిళ ఉపాధ్యాయులు భాషను పరిచయం చేశారని చెప్పారు. తమ భాష, సంస్కృతిపై జరిగే ఎటువంటి దాడినైనా ఎదుర్కోవాలని సీఎన్ అన్నాదురై..తదితర నేతల నుంచి నేర్చుకున్నానని అన్నారు. హైస్కూల్ మధ్యలో చదువు మానేసిన తాను ఆర్థికశాస్త్రంపై మాట్లాడేందుకు అర్హుడని కాదని ఎవరు అనుకున్నా అభ్యంతరం లేదని, తాను మాత్రం మాట్లాడుతానని స్పష్టంచేశారు. తమిళుడిగా తనకు ఓ స్పష్టమైన అభిప్రాయం ఉందన్నారు. ప్రస్తుత రాజకీయాలను నేటి యువత నిశితంగా గమనిస్తోందన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని నింపుతూ భవిష్యత్తు తమదేనన్న వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

# రాహుల్ వ్యాఖ్యలు.. భగ్గుమన్న భాజపా!

కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టును ఉద్దేశించి 'ద్రోహి' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు ఓ వర్గాన్ని బాధించాయని పేర్కొంది. ప్రతిపక్ష నేతపై లోక్‌సభ స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాహుల్ గాంధీ అన్ని హద్దులు దాటారని కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురీ విమర్శించారు. ''ద్రోహి అనే పదాన్ని తేలికగా తీసుకోకూడదు. దేశానికి ద్రోహం చేసిన వ్యక్తిని ఉద్దేశించి ఈ పదాన్ని ఉపయోగిస్తారు. కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు కేవలం



ఓ ఎంపీ మాత్రమే కాదు. దేశానికి సేవలందించిన ఓ కుటుంబానికి చెందిన వ్యక్తి కూడా. పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన తాత సర్దార్ బియాంత్ సింగ్ ఓ అమరవీరుడు. అలాంటి వ్యక్తిని దేశద్రోహి అని పిలిచారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు'' అని హర్‌దీప్ సింగ్ పురీ మండిపడ్డారు. మరోవైపు.. రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం సమీపంలో భాజపా శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. దేశానికి గర్వకారణమైన ఓ వర్గాన్ని ఆయన కించపర్చారని భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఆరోపించారు. గాంధీ కుటుంబమే అసలైన ద్రోహి అని దిల్లీ మంత్రి మన్‌జిందర్ సింగ్ సిర్సా ఆరోపించారు.

**అసలేం జరిగిందంటే..**

పార్లమెంటు ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసన తెలుపుతున్న సమయంలో కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు అటుగా వచ్చారు. 'ఇదిగో ఇక్కడ ఓ ద్రోహి నడుచుకుంటూ వెళ్తున్నాడు' అంటూ రాహుల్ విమర్శలు చేశారు. తిరిగి (కాంగ్రెస్‌లోకి) వస్తావంటూ ఎద్దేవా చేశారు. దీనికి కేంద్ర మంత్రి గట్టి కౌంటర్ ఇచ్చారు. రాహుల్‌తో కరచాలనం చేసేందుకు నిరాకరిస్తూనే.. 'మీరు దేశానికి ద్రోహం చేశారు' అని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన బిట్టు.. 2024 ఎన్నికల ముందు భాజపాలో చేరారు.

## బడ్జెట్‌లో లోపాలు చెప్పగలరా?
# రాహుల్‌గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సీతారామన్ మాట్లాడుతూ.. ఆయన చేసిన వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారం లేదని అన్నారు. బడ్జెట్‌లో లోపాలు ఉన్నాయని చేస్తున్న ఆరోపణలను నిరూపించే అంశాలను కాంగ్రెస్ నేత తన ముందు నిలబడి చెప్పగలరా?అని సవాల్ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలన్నారు. తమ ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బడ్జెట్



లో ప్రధానంగా దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న కార్మిక మార్కెట్ అవసరాలను తీర్చడానికి వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాలు వంటి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని.. దేశం ఎదుర్కొంటున్న నిజమైన సంక్షోభాలపై దృష్టి సారించలేకపోయిందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు లేవని, తయారీ రంగం పతనమవుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులు పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులు, ప్రపంచ దేశాల నుంచి తగులుతున్న ఎదురు దెబ్బలు వంటి అంశాలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

## మణిపుర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్
# ప్రమాణ స్వీకారం

మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనకు తెరపడింది. నూతన సీఎంగా భాజపా నేత వై.ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా ఆయనతో ప్రమాణం చేయించారు. భాజపా ఎమ్మెల్యే నెమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ శాసనసభ్యుడు ఎల్.డిఖో ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మణిపుర్‌లో 2023 మేలో మొదలైన జాతుల మధ్య ఘర్షణలు హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. 260 మందికిపైగా మృతి చెందగా.. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ ఘటనల నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరిలో అప్పటి సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేశారు. అనంతరం రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు ఏడాది తర్వాత బుధవారం ఎత్తివేశారు. ఖేమ్‌చంద్ సింగ్ ఇప్పటికే రాష్ట్ర



ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. 2017 నుంచి 2022 వరకు మణిపుర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022లో బీరెన్‌సింగ్ సర్కారులో మంత్రిగా నియమితులయ్యారు. మణిపుర్‌లోని మూడు కీలక సామాజిక వర్గాలతోనూ (మైతేయ్‌లు, కుకీలు, నాగాలు) సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది.


## ఎన్సీపీ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు
# ఫడణవీస్‌కు లేదు: శరద్‌పవార్...

విమాన ప్రమాదంలో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కన్నుమూయడంతో మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను ఉద్దేశిస్తూ ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్‌పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్సీపీ రెండు వర్గాల విలీనం చర్చల్లో సీఎం పాల్గొనలేదని, దీనిపై మాట్లాడే హక్కు ఆయనకు ఎక్కడిదీ? అంటూ ప్రశ్నించారు.
ఇటీవల ఎన్సీపీ వర్గాల విలీనంపై సీఎం చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అన్ని విషయాలపై అజిత్ తనతో చర్చించేవారని, పార్టీ విలీనం నిజమైతే ఎన్డీయే వీడేవారని తెలిపారు. కానీ అలా జరగలేదంటూ.. అజిత్ మరణానంతరం పార్టీ విలీనమంటూ ప్రచారం చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. దీనిపై తాజాగా శరద్ పవార్ స్పందించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ''ఎన్సీపీ రెండు వర్గాల విలీనంపై అజిత్ సానుకులంగా ఉండేవారు. గత



రెండు నెలలుగా మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌పాటిల్‌తో చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చల్లో సీఎం పాల్గొనలేదు. మరి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునే హక్కు ఆయనకు ఎక్కడిదీ?'' అంటూ ప్రశ్నించారు. అజిత్ అకాల మరణంతో తమ కుటుంబంలో విషాదం నెలకొందన్నారు. డిప్యూటీ సీఎంగా సునేత్రా పవార్ బాధ్యతలు స్వీకరించడాన్ని స్వాగతిస్తున్నామని, ప్రస్తుతం రాజకీయాలపై చర్చించే సమయం కాదన్నారు. తమకు మద్దతుగా నిలిచిన కార్యకర్తలకు అండగా నిలవడమే పార్టీ ముందున్న కర్తవ్యమన్నారు.

## ఇండిగో షెడ్యూల్‌లో సర్దుబాటు..
# ఆ మార్గాల్లో సర్వీసుల తగ్గింపు!




కార్యాచరణ సమస్యల కారణంగా దూరప్రాంతాలకు వెళ్లే తమ విమానాల షెడ్యూల్‌లో సర్దుబాటు చేయనున్నట్లు ఇండిగో విమానయాన సంస్థ ప్రకటించింది. ఈ నెల 17వ తేదీనుంచి తదుపరి నోటీసులు జారీ చేసేవరకు డెన్మార్క్ రాజధాని కోపన్‌హేగన్‌కు విమాన సర్వీసులు నిలిపివేయనున్నట్లు వెల్లడించింది. అదేవిధంగా ఈ నెల 7 నుంచి దిల్లీ మాంచెస్టర్, 9 నుంచి దిల్లీ లండన్ హీత్రూ మార్గాల్లో సర్వీసులను తగ్గించనున్నట్లు పేర్కొంది. ''భౌగోళిక రాజకీయ పరిస్థితుల వల్ల గగనతలంలో ఆంక్షలు నిరంతరం మారుతున్నాయి. భారత్‌తోపాటు విదేశాల్లోని విమానాశ్రయాల్లో రద్దీ నెలకొంటోంది. దీంతో విమాన ప్రయాణ సమయం భారీగా పెరుగుతోంది. ఫలితంగా సంస్థకు చెందిన వైడ్ బాడీ విమానాల (787 9) షెడ్యూల్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. దీంతో దూరప్రాంత విమానాల షెడ్యూల్‌లో సర్దుబాటు నిర్ణయం తీసుకున్నాం. వాస్తవానికి ఈ ఏడాది వేసవి షెడ్యూల్‌లో ఈ చర్యలు చేపట్టాలని భావించాం. కానీ, మిగతా దూరప్రాంత విమానాల కార్యకలాపాలు సాఫీగా, స్థిరంగా నడిచేలా చూసేందుకు ముందుగానే అమలు చేస్తున్నాం. ప్రయాణికులకు కలిగే అసౌకర్యాన్ని నివారించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నాం'' అని ఇండిగో ఓ ప్రకటనలో తెలిపింది.

# యూఎస్‌తో ఒప్పందం.. ఆ రంగాలకు ప్రయోజనకరమే

**: పీయూష్ గోయల్**

అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నప్పటికీ వ్యవసాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను వీడలేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశంలోని ముఖ్యమైన రంగాల్లో దేనినీ విస్మరించలేదన్నారు. ఇరుదేశాల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని దౌత్య సంబంధాలపై ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఇందులోభాగంగా 140 కోట్ల మంది దేశ ప్రజల ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఏడాది పాటు అమెరికాతో పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం దీనిపై ట్రంప్ ప్రకటన



వెలువరించారని తెలిపారు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో మాట్లాడుతూ పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారని గోయల్ పేర్కొన్నారు. తోలు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని కార్మికులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాంల కన్నా తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయని పేర్కొన్నారు. దీనిపై త్వరలో రెండు దేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయని, అందులో మరిన్ని వివరాలు వెల్లడవుతాయన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వారు జైషే మహ్మద్‌కు చెందినవారుగా గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించి నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అనంతరం మిలిటెంట్లు పారిపోయారు. ఉదంపుర్ ప్రాంతంలోని గుహల్లో వారు ఉన్నట్టు సమాచారం అందడంతో మళ్లీ గాలింపు చేపట్టారు. గుహలో ఉన్న వారిపై కాల్పులు జరపడంతో ఇద్దరు మిలిటెంట్లు హతమయ్యారని.. వారిలో ఒకరు పాక్ జాతీయుడు కాగా మరొకరు స్థానిక వ్యక్తి అని పేర్కొన్నారు.


# అవసరాలే... అందంగా..!

**అయ్యో... ఉప్పెక్కడ పెట్టాను... దనియాలపొడి కనిపించడం లేదు... మిరియాలపొడి ఏ డబ్బాలో పెట్టానో... బ్రేక్ ఫాస్ట్ కోసం ఓట్స్ తీస్తుంటే గిన్నెలో ఎక్కువ పడిపోయాయి... ఇవన్నీ రోజూ మన కిచెన్‌లో జరిగేవే కదా. చిన్న సమస్యలుగానే ఉన్నా కనిపించని సమయం వృథా అయ్యేది ఇక్కడే. వాటన్నింటికీ పరిష్కారంగా వచ్చినవే ఈ ఆర్గనైజర్లు.. వేటికవే ప్రత్యేకం, మనకీ ఉపయోగకరం...**











### * అతుక్కుంటాయి... స్థలాన్ని ఆదా చేస్తాయి...

వంటింటి వస్తువులను పెట్టుకోవడానికి వీలుగా కిచెన్‌లో ర్యాక్స్ లేనివాళ్లకి 'మాగ్నటిక్ స్పైస్ జార్స్' బాగా ఉపయోగపడతాయి. రిఫ్రిజిరేటర్‌కి అతికించుకునేందుకు వీలుగా జాడీల వెనక లేదా మూతలకి అయస్కాంతంతో తయారైన ఈ కంటైనర్లు ట్రాన్స్‌పరెంట్‌గా ఉండి లోపల ఉండే మసాలాలు సులువుగా కనిపిస్తాయి. స్టవ్ దగ్గరగా ఉండాలనుకుంటే మాగ్నటిక్ బోర్డును గోడకు ఫిట్ చేసుకుని జార్‌లను అతికించుకుంటే సరిపోతుంది. వివిధ రకాల ఆకారాల్లోనూ, సైజుల్లోనూ ఇవి దొరుకుతున్నాయి.


### డైనింగ్ టేబుల్ కొత్తగా...

డైనింగ్ టైబుల్‌పై ఉప్పు, మిరియాలపొడులు, కారప్పొడులు వేసుకునే డబ్బాలు మనం చూస్తూనే ఉంటాం. ఆ డబ్బాలే కాస్త ఆకర్షణీయంగా కనిపిస్తే భలే అందంగా ఉంటాయి కదా. అయితే ఈ 'యానిమల్ హోల్డర్ విత్ సాల్ట్ అండ్ పెప్పర్ షేకర్ సెట్' మీ ఇంట్లో ఉండాల్సిందే. ఇవి ఆహారానికి రుచినే కాదు, ఇంటికి అందాన్నీ ఇస్తాయి. జిరాఫీ, ఏనుగులంటూ మనకు కావాల్సిన జతువుల రూపాల్లో దొరుకుతున్నాయి. పరిమాణంలో చిన్నగా ఉండటం వల్ల ఎక్కడికంటే అక్కడికి మార్చుకోవడమూ సులువే.

### డబ్బా కోసం వెతకక్కర్లేదు...

నెలకు సరిపడా సరకులు ఒకేసారి తెచ్చేసుకుంటాం. ఎక్కడివక్కడ సర్దేసుకుంటాం. ఆఫీసుకి వెళ్లే హడావుడిలో సరిపడినంత పప్పు, పిల్లలు రోజూ తినే ఓట్‌మీల్ వంటివి సమపరిమాణంలో కొలిచి తీసుకునే సమయం ఉండదు. దాంతో ఎక్కువ తక్కువలు అవుతుంటాయి. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చినవే ఈ 'గ్రిడ్ సెరెల్ ఫుడ్ డిస్పెన్సర్స్'. ఒక్కో కంటెయినర్ విడివిడిగా లేదా నాలుగైదు కలిపి గోడకు లేదా టేబుల్‌పై పెట్టుకునేలా వీటిని రూపొందించారు. వీటిల్లో పప్పు, ఓట్స్, స్నాక్స్ ఏవైనా నింపి దాని ముందు భాగంలో ఉన్న వాల్వ్ తిప్పితే రంధ్రం నుంచి పప్పు కిందికి వచ్చి కొలతకోసం ఇచ్చిన కప్పులో పడుతుంది. దాంతో ఎక్కువ తక్కువలు పడతాయనే భయమూ ఉండదు.

# పాటపాడే లాలీపాప్!



**'బాబూ ఇళయరాజా పాటపాడే ఒక లాలీపాప్ ఇవ్వు'... అని ఒక పెద్దాయన అంటే, 'అన్నా ఒక కె- పాప్ ట్రాక్ లాలీపాప్ ఇవ్వు' అన్నాడు మరో టీనేజీ కుర్రాడు... వినేవాళ్లకు ఇదంతా అయోమయంగానూ, ఆశ్చర్యంగానూ ఉంటుంది. అదీ నిజమే కదా... మ్యూజిక్ ట్రాక్స్‌కీ, తినే లాలీపాప్స్‌కీ ఏంటి సంబంధం అనిపిస్తుంది కానీ, మీరు వింటున్నది 100 శాతం నిజమే... ఇవి ఆడియో లాలీపాప్స్. మన చెవులకు మాత్రమే వీనుల విందైన సంగీతం అందిస్తాయివి. కావాలంటే మీరూ ఓ లాలీపాప్ తిని చూడండి...**

చెవుల్లో తీగలున్న ఇయర్‌ఫోన్స్, తీగలు లేని ఇయర్‌బడ్స్ లేకుండా దాదాపు యువత కనిపించదు. కానీ అవేమీ లేకుండా కూడా సంగీతాన్ని వినే అవకాశం కల్పిస్తున్నాయి ఆడియో లాలీపాప్స్. ఇయర్ ఫోన్లూ, మరే ఇతర స్పీకర్లూ లేకుండానే, కేవలం ఒక లాలీపాప్‌ని తింటూ, అద్భుతమైన సంగీతాన్నీ ఆస్వాదించవచ్చు. ఈ సంగీతం మనకు తప్ప వినాలనుకున్నా మరెవరికీ వినిపించదు. అవును, ఒక పక్క తియ్యని రుచి నోటికీ, మనసుకీ ఆనందం కలిగిస్తుంటే మరోపక్క మీకిష్టమైన సంగీతం ఆ ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే సంగీత ప్రియులు పెద్దగా డబ్బులు ఖర్చుపెట్టకుండానే మినీ కాన్సర్ట్‌ని సోలోగా ఎంజాయ్ చేయొచ్చు... అది కూడా మీకు నచ్చిన పాటలతో. అదెలాగో చూద్దాం...



### బోన్ కండక్షన్ టెక్నాలజీతో...

ఎవరికీ వినిపించకుండా మనకు మాత్రమే సంగీతం వినిపిస్తుందా... ఇదేదో మ్యాజిక్‌లా ఉందే అనుకుంటున్నారా? అబ్బే అదేం కాదు, దీని వెనుక ఏ మాయాలేదు, మంత్రం లేదు, అబ్బురపరిచే టెక్నాలజీ మాత్రమే ఉంది. అదే... బోన్ కండక్షన్ టెక్నాలజీ. లాలీపాప్‌ని కొరికినా, నాలుకతో తాకినా దానిలో అప్పటికే ప్రీలోడ్ చేసిన పాటలు శబ్దతరంగాల నుంచి వైబ్రేషన్స్‌గా మారి దవడ ఎముక నుంచి చెవిలోపల ఉండే కాక్లియర్ భాగానికి చేరుకుంటాయి. సాధారణంగా మనం వినే శబ్దాలన్నీ బయట చెవి నుంచి కర్ణభేరికి చేరి అక్కడ నుంచి మెదడుకు వెళతాయి. కానీ ఈ విధానంలో బయట మనకు కనిపించే చెవితోకానీ, కర్ణభేరితో కానీ ఏమాత్రం పని ఉండదు. పంటి నుంచి కానీ, దవడ ఎముక నుంచి కానీ లాలిపాప్‌లో ఉన్న పాటలు నేరుగా లోపలి చెవికి చేరిపోతాయి. అందుకే మనకి మాత్రమే ఈ సంగీతం వినబడుతుంది. 'అమ్మో ఇదేదో కొత్త టెక్నాలజీ, చెవులకు ఇబ్బందేమీ కాదు కదా' అనుకుంటున్నారా? దీంతో చెవులకు ఏమాత్రం ఇబ్బంది లేదు, ఎందుకంటే ఈ టెక్నాలజీని ఇప్పటికే మనం చికిత్సల్లో వాడుతున్నాం కాబట్టి. వినికిడి సమస్యలున్నవారికి హియరింగ్ ఎయిడ్స్‌లో ఈ టెక్నాలజీని వాడే శబ్దాలు వినబడేటట్టు చేస్తున్నారు. అలాగే, క్రీడాకారులకూ, ఈతకొట్టేవారికీ సాధారణ హెడ్‌సెట్స్ సౌకర్యంగా ఉండవు, పరుగుపెట్టినప్పుడు పడిపోయే అవకాశాలెక్కువ... నీళ్లలో సరిగా వినిపించవు కాబట్టి అక్కడా వీటినే ఉపయోగిస్తారు. ఎమర్జెన్సీ సమయంలో సమాచారం చేరవేయడానికి మిలటరీ వాళ్లూ తమకు మాత్రమే అర్థమయ్యేలా ఈ బోన్‌కండక్షన్ టెక్నాలజీనే వాడి సందేశాలు వింటూ ఉంటారు. ఈ టెక్నాలజీని వాడే ఆడియోలాలీపాప్స్‌నీ తయారుచేస్తున్నారు.



### ఏ పాట కావాలన్నా...

ఈ లాలీపాప్స్‌తో ఏవో కొన్ని పాటలు కాదు, మనకు బాగా నచ్చిన ఏ పాటనైనా ఆస్వాదించవచ్చు. లవోలీ, లాలీట్యూన్, లాలీపాప్‌స్టార్, అమోస్‌టేస్టీ సౌండ్స్ లాంటి సంస్థలు అటు లాలీపాప్స్‌ని స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, కోలా వంటి రుచుల్లో అందిస్తూనే, కుర్రకారు ఇష్టపడే కె పాప్ ట్రాక్స్‌తోపాటు హాలీవుడ్‌లోని అనేక పాపులర్ పాటలని ప్రీలోడ్ చేసి ఇస్తున్నాయి. అవికాదు, మా అభిమాన గాయకుడూ, సంగీత దర్శకుడూ వేరే ఉన్నారు అనుకుంటే వాళ్లపాటలనీ కస్టమైజ్ చేసి అందించే సౌకర్యాన్ని కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. కొందరైతే పుట్టినరోజు కానుకగా ఇవ్వడానికి ప్రత్యేకంగా హ్యాపీబర్త్‌డే సాంగ్స్‌ని పొందుపరిచి ఈ లాలీ పాప్స్‌ని చేయించుకుంటున్నారు. వీటితో ఆరు నిమిషాల నుంచి గంటవరకూ సంగీతాన్ని వినొచ్చు. కొన్నిసంస్థలు పాడ్‌కాస్టింగ్ వినే సదుపాయం కూడా కల్పిస్తున్నాయి. ఆ సంగతి సరే, సంగీతం కోసం తీపి తిని మా ఆరోగ్యం పాడుచేసుకుంటామా అనుకునే వారికోసం... షుగర్ ఫ్రీ లాలీపాప్స్‌ని కూడా ప్రత్యేకంగా తయారుచేస్తున్నారు. అదన్నమాట విషయం, మరి ఇంకెందుకు ఆలస్యం.. ఒక లాలీపాప్‌ని మీరూ చప్పరించేయండి. సంగీత ఝరిలో మునిగితేలండి.



# విటమిన్ ఎ ఎందుకంటే..

**విటమిన్ ఎ అనేది కొవ్వులో కరిగే (ఫ్యాట్-సొల్యుబుల్) విటమిన్. ఇది మన శరీరానికి చాలా ముఖ్యమైన పోషకం. మహిళల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చర్మ సంరక్షణని పట్టించుకునే యువతులు... అందరికీ ఇది అత్యవసరం. ఎందుకో తెలుసుకుందామా?**

విటమిన్ ఎ రాత్రిపూట స్పష్టంగా చూడటానికి సహాయపడుతుంది. ఇది రెటినాలోని రోడోప్సిన్ అనే పదార్థం ఏర్పడటానికి అవసరం. దీని లోపం ఉంటే రేచీకటి వస్తుంది.

చర్మ కణాల పునరుత్పత్తికి సహాయపడుతుంది. మొటిమలు, పొడి చర్మం సమస్యలను తగ్గిస్తుంది. అందుకే దీన్ని రెటినాయిడ్ క్రీమ్‌లు, చర్మ సౌందర్య చికిత్సల్లోనూ వాడతారు.

విటమిన్ ఎ తెల్ల రక్త కణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. ఫలితంగా రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది. మీజిల్స్ వంటి వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.

శిశువు అవయవాలు (ముఖ్యంగా కళ్లు, ఊపిరితిత్తులు, గుండె) సరిగ్గా ఎదగడానికి విటమిన్ ఎ సహాయపడుతుంది. గర్భిణుల్లో రోగ నిరోధకతను పెంచుతుంది. అంతేకాదు... పాలిచ్చే తల్లులకు ఈ పోషకం రోజువారీ అవసరం మరింత ఎక్కువ. ఎందుకంటే... శిశువుకు తల్లిపాల ద్వారానే విటమిన్ ఎ అందుతుంది. అంతేకాదు...ఇది బీటా కెరొటిన్ రూపంలో క్యాన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

**విటమిన్ ఎ సాధారణంగా రెండు రూపాల్లో లభిస్తుంది:**

1. రెటినాల్: దీన్ని శరీరం నేరుగా ఉపయోగించుకుంటుంది. లివర్, ఫిష్ ఆయిల్, గుడ్లు (పచ్చసొన), పాలు, పెరుగు, వెన్న, చీజ్ వంటివాటి నుంచి ఇది లభిస్తుంది.
2. బీటాకెరొటిన్: ఇది శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది. ఇది నారింజ, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలు/పండ్లు) అయిన క్యారెట్, బత్తాయి, పాలకూర, ఆకుకూరలు, మామిడి పండు, బొప్పాయి, బ్రాకలీ, క్యాప్సికం వంటివాటి నుంచి అందుతుంది.

# తగ్గిన జోరు... ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**స్టాక్ మార్కెట్ల రెండు రోజుల లాభాలకు బ్రేక్**

**ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి**

**కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంపై పెరిగిన ఆందోళనలు**

**స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ**

**భారీ నష్టాలను చవిచూసిన ఇన్ఫోసిస్, టీసీఎస్**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజుల లాభాలకు బుధవారం బ్రేక్ పడింది. ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీలు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 78.56 పాయింట్ల స్వల్ప లాభంతో 83,817.69 వద్ద, నిఫ్టీ 48.45 పాయింట్లు పెరిగి 25,776.00 వద్ద స్థిరపడ్డాయి.

కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీలో వేగంగా వస్తున్న పురోగతిపై నెలకొన్న కొత్త ఆందోళనలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ న్యాయవాదుల కోసం ఒక కొత్త టూల్‌ను ప్రారంభించడమే ఇందుకు కారణం. ఇలాంటి ఏఐ టూల్స్ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవలకు డిమాండ్ తగ్గి, ఐటీ పరిశ్రమ లాభదాయకత దెబ్బతినవచ్చని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావంతోనే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6 శాతం కుప్పకూలింది.

సెన్సెక్స్ స్టాక్స్‌లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధాన నష్టాల్లో ముగిశాయి. యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, ఐటీతో పాటు ఫార్మా ఇండెక్స్ కూడా 0.34 శాతం నష్టపోయింది. అయితే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 2.6 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2 శాతం పెరిగి మార్కెట్లకు మద్దతునిచ్చాయి.

ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, బ్రాడర్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.27 శాతం లాభపడ్డాయి. నిపుణుల ప్రకారం, నిఫ్టీ రోజంతా 25,680 - 25,820 మధ్య పరిమిత శ్రేణిలో కదలాడింది. 25,800 స్థాయిని దాటితేనే సూచీలో మరింత సానుకూలత రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

**గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు**

**దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్ల మంది ఆధార్ నంబర్ల రద్దు**

**పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద**

**ఆధార్ భద్రతకు బయోమెట్రిక్ లాక్, ఫేస్ అథెంటికేషన్ ఫీచర్లు**

**డేటాబేస్ శుద్ధీకరణలో భాగంగా యూఐడీఏఐ ఈ నిర్ణయం**




**న్యూఢిల్లీ:** గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు.

ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఐఎఐఎ) అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ-కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

# ట్రంప్ నిర్ణయం ఎఫెక్ట్...

**బెంగళూరులో గూగుల్ భారీ క్యాంపస్!**



**బెంగళూరు:** టెక్ దిగ్గజం గూగుల్ బెంగళూరులో భారీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైందని బ్లూమ్‌బర్గ్ కథనం పేర్కొంది. హెచ్1బీ వీసాల జారీకి అమెరికా కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. దీంతో విదేశీ ఉద్యోగుల నియామకం టెక్ కంపెనీలకు భారంగా మారింది. దీనితో గూగుల్ కీలక చర్యలు చేపట్టింది. వీసాలు, ప్రభుత్వ అనుమతులతో సంబంధం లేకుండా, భారత్‌లో కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు సిద్ధమైంది.

బ్లూమ్‌బర్గ్ కథనం ప్రకారం, దేశంలోనే అతిపెద్ద టెక్ హబ్ అయిన బెంగళూరులోని వైట్ ఫీల్డ్‌లో గూగుల్ లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో కొత్త కార్యాలయాన్ని నిర్మించేందుకు సిద్ధమైంది. 20 వేల మంది ఉద్యోగుల కోసం ఈ క్యాంపస్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఓ ఆఫీస్ టవర్‌ను గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ లీజుకు తీసుకుందని, మరో రెండు టవర్ల కోసం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ఈ మూడు టవర్లు 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలుస్తోంది. తొలి టవర్ లీజును అల్ఫాబెట్ కూడా ధృవీకరించింది. మొదటి టవర్ కొన్ని నెలల్లో కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, మిగిలిన రెండు టవర్ల నిర్మాణం వచ్చే సంవత్సరం పూర్తవుతుందని పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో గూగుల్‌కు 14 వేల మంది ఉద్యోగులు ఉండగా, వైట్ ఫీల్డ్ క్యాంపస్ పూర్తిగా మొదలైతే అమెరికా వెలుపల గూగుల్ కార్యకలాపాలకు భారత్ కీలక కేంద్రంగా మారనుంది.

# అండర్-19 వరల్డ్ కప్... ఫైనల్లోకి దూసుకెళ్లిన టీమిండియా...

**ఇంగ్లండ్‌తో అమీతుమీకి సై**

**అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లోకి ప్రవేశించిన భారత్**

**సెమీస్‌లోఆఫ్ఘనిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం**

**శతకంతో కదం తొక్కిన ఆరోన్ జార్జ్ (115)**

**311 పరుగుల భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన యంగ్ ఇండియా**

**ఫైనల్లో ఇంగ్లండ్‌తో తలపడనున్న భారత్**



**హరారే:** అండర్-19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు అదరగొట్టింది. రికార్డు స్థాయి ఛేజింగ్ తో ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన రెండో సెమీ ఫైనల్లో ఆఫ్ఘనిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115) అద్భుతమైన సెంచరీతో చెలరేగగా, విధ్వంసకర హాఫ్ సెంచరీలతో వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఫిబ్రవరి 6న ఇదే వేదికపై జరగనున్న ఫైనల్లో భారత్, ఇంగ్లండ్‌తో తలపడనుంది.

ఆఫ్ఘనిస్థాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు పెద్దగా రాణించని ఆరోన్ జార్జ్, కీలకమైన సెమీస్‌లో బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో 115 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68) మెరుపు ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించాడు. ఫీల్డర్లు రెండుసార్లు క్యాచ్‌లు జారవిడిచిన అవకాశాన్ని సూర్యవంశీ చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. అనంతరం కెప్టెన్ ఆయుష్ మాత్రే (39 బంతుల్లో 62) కూడా వేగంగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.

భారత ఛేదనలో భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషించాయి. తొలి వికెట్‌కు జార్జ్, సూర్యవంశీ 90 పరుగులు జోడించగా, రెండో వికెట్‌కు జార్జ్, కెప్టెన్ మ్హాత్రే కలిసి 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇక మూడో వికెట్‌కు విహాన్ మల్హోత్రా (47 బంతుల్లో 38 నాటౌట్)తో కలిసి జార్జ్ మరో 96 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయ తీరాలకు చేర్చాడు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్ఘానిస్థాన్, నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫైసల్ షినోజాడా (93 బంతుల్లో 110), ఉజైరుల్లా నియాజీ (86 బంతుల్లో 101 నాటౌట్) అద్భుత సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్, కనిష్క్ చౌహాన్ చెరో రెండు వికెట్లు తీసినప్పటికీ, మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ విజయంతో భారత్ మొత్తమ్మీద పదోసారి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించగా, వరుసగా ఆరోసారి తుదిపోరుకు చేరడం విశేషం.

# భారత్, పాకిస్థాన్‌లను ఇకపై ఐసీసీ వేర్వేరు గ్రుపూల్లో పెట్టొచ్చు: గవాస్కర్

**ఇండియాతో మ్యాచ్ ను పాక్ బహిష్కరించడంపై గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**ఆదాయం కోసం ఇరు జట్లను ఐసీసీ ఒకే గ్రూప్ లో పెడుతోందని వ్యాఖ్య**

**ఇకపై ఈ రెండు దేశాలను ఒకే గ్రూపులో పెట్టకుండా ఐసీసీ చూసుకోవచ్చన్న గవాస్కర్**



**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ లో భారత్ తో జరగాల్సిన మ్యాచ్ ను బహిష్కరించాలని పాకిస్థాన్ నిర్ణయించడంపై భారత్ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్, పాకిస్థాన్ ను ఇకపై వేర్వేరు గ్రూపుల్లో పెట్టేందుకు ఇదే మంచి అవకాశం అని అన్నాడు.

ఇండియా టుడేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో గవాస్కర్ మాట్లాడుతూ, "2007లో రెండు దేశాలు వేర్వేరు గ్రూపుల్లో ఉండటం వల్ల మ్యాచ్ జరగలేదు. టోర్నీలో ఏదో ఒక దశలో ఇరు జట్లు తలపడతాయని భావించినప్పటికీ అది జరగలేదు. లీగ్ దశలోనే జట్లు నిష్క్రమించడంతో... ఇరు జట్ల మధ్య మ్యాచ్ జరగలేదు. అప్పటి నుంచి టోర్నీల వాణిజ్య విజయం కోసం ఐసీసీ రెండు దేశాలను ఒకే గ్రూపులో పెడుతోంది. ఈ రెండు దేశాలు తలపడే మ్యాచ్ లకు ఎక్కువ రెవెన్యూ వస్తుంది" అని వివరించాడు. ఇకపై డ్రాలో ఇద్దరినీ ఒకే గ్రూపులో పెట్టకుండా ఐసీసీ జాగ్రత్త పడొచ్చు అని అన్నాడు.

పాక్‌తో ఆడటానికి భారత్ కు ఎలాంటి ఒత్తిడి లేదని, ఇటీవలి కాలంలో భారత్ పాక్‌ను సులభంగా ఓడిస్తోందని గవాస్కర్ వ్యంగ్యంగా అన్నాడు. భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్ చివరిసారి 2012-13లో జరిగింది. అప్పటి నుంచి రెండు దేశాలు ఐసీసీ, ఏసీసీ ఈవెంట్లలో మాత్రమే ఆడుతున్నాయి. టోర్నీల వాణిజ్య లబ్ధ కోసం ఐసీసీ ఇద్దరినీ ఒకే గ్రూపులో పెడుతోంది. పాక్ బాయ్‌కాట్ తర్వాత ఈ విధానం మారవచ్చని గవాస్కర్ అంచనా వేశాడు.

# సత్తాచాటిన మీరాబాయి జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ టోర్నీ



**న్యూఢిల్లీ:** జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను సత్తాచాటింది. మహిళల 48కిలోల విభాగంలో బరిలోకి దిగిన మీరాబాయి..తన పేరిటే ఉన్న మూడు జాతీయ రికార్డులను తిరుగరాసింది. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక టోర్నీల్లో పతకాలు కొల్లగొట్టిన మీరా తాజాగా జాతీయస్థాయిలోనూ తనకు తిరుగులేదని చాటిచెప్పింది. తాను పోటీకి దిగిన 48కిలోల కేటగిరీలో స్నాచ్‌లో 89కిలోలు ఎత్తిన క్లీన్ అండ్ జర్క్‌లో 116కిలోలతో మొత్తంగా 205కిలోలతో కొత్త జాతీయ రికార్డులను తన పేరిట లిఖించుకుంది. ఈ ప్రదర్శన తన ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందని మీరా పేర్కొంది.

# ఐసీసీ ర్యాంకుల్లో ఇషాన్ కిషన్ లాంగ్ జంప్

**ఒకేసారి 32 స్థానాలు ఎగబాకిన ఇషాన్ కిషన్**

**ఆరో స్థానానికి ఎగబాకిన సూర్యకుమార్ యాదవ్**

**బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ నెం.1 స్థానం పదిలం**

**బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి దూసుకొచ్చిన అబ్రర్ అహ్మద్**




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ సత్తా చాటాడు. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో ఏకంగా 32 స్థానాలు ఎగబాకాడు. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లలో తొలి టీ20 సెంచరీతో సహా 207 పరుగులు చేసిన ఇషాన్, ప్రస్తుతం బ్యాటర్ల జాబితాలో 32వ స్థానంలో నిలిచాడు. మరోవైపు, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకున్నాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ బ్యాటర్ల జాబితాలో తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు.

ఇక ఆల్ రౌండర్ల విభాగంలో పాకిస్థాన్ ఓపెనర్ సయీమ్ అయూబ్ సంచలనం సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో 119 పరుగులు చేయడంతో పాటు 3 వికెట్లు పడగొట్టి సికందర్ రజాను వెనక్కి నెట్టి నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.

బౌలర్ల జాబితాలో పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ రెండో స్థానానికి దూసుకొచ్చాడు. అగ్రస్థానంలో ఉన్న వరుణ్ చక్రవర్తికి కేవలం 28 పాయింట్ల దూరంలో ఉన్నాడు. అదే సిరీస్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన మహమ్మద్ నవాజ్ ఏడో ర్యాంకుకు చేరుకోగా, ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ నాలుగో స్థానానికి, న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ 23వ స్థానానికి ఎగబాకారు.

ఇతర బ్యాటర్ల విషయానికొస్తే, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ మూడో స్థానానికి, శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సంక ఐదో స్థానానికి, న్యూజిలాండ్ బ్యాటర్ టిమ్ సీఫెర్ట్ తొమ్మిదో స్థానానికి చేరుకున్నారు. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ర్యాన్ రికెల్టన్ 42 స్థానాలు మెరుగుపరుచుకుని 40వ ర్యాంకుకు, క్వింటన్ డి కాక్ 15 స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకుకు చేరుకున్నారు. ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ర్యాంకింగ్స్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

MOVIE TIME

## బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్




టాకీస్: ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది.ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బుల్లెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది.గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.

## బోర్డర్-2 నుంచి ఘర్ కబ్ ఆవోగే సాంగ్ విడుదల




టాకీస్: బాలీవుడ్ క్లాసిక్ వార్ డ్రామా 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'బోర్డర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని సాధించి సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాలోని ఎమోషనల్ సాంగ్ 'ఘర్ కబ్ ఆవోగే పూర్తి స్థాయి వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. 1997 నాటి ఐకానిక్ పాటను పునర్నిర్మించిన ఈ వెర్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పాటను ఒరిజినల్ గాయకులు సోనూ నిగమ్, రూప్ కుమార్ రాథోడ్‌లతో కలిసి నేటి తరం గాయకులు అర్జిత్ సింగ్, విశాల్ మిశ్రా, దిల్జిత్ దోసాంజ్ అద్భుతంగా ఆలపించారు. అను మాలిక్ స్వరపరిచిన ఒరిజినల్ ట్యూన్‌కు సంగీత దర్శకుడు మిథూన్ సరికొత్త హంగులు అద్దారు. దాదాపు 10 నిమిషాల నిడివి గల ఈ వీడియో సాంగ్‌లో సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్ మరియు అహన్ శెట్టి సైనికుల భావోద్వేగాలను, వారి త్యాగాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. 1971 భారత్-పాక్ యుద్ధ నేపథ్యంలో అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 23, 2026న విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.




## చిరు మూవీలో సారా అర్జున్

టాకీస్: మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

## అవతార్ లెవల్లో వారణాసి మూవీ

### పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదిరింది

### ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు

### అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం

### అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు




టాకీస్: రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 15 ఏళ్ల కిత్రమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్‌ఆర్‌ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది.

## ప్రేమలు సీక్వెల్ ఆగిపోలేదు




టాకీస్: మలయాళ సెన్సేషనల్ హిట్ 'ప్రేమలు' చిత్రానికి సీక్వెల్ రాబోతున్న విషయం తెలిసిందే. 'ప్రేమలు 2' అంటూ ఈ సీక్వెల్ రాబోతుండగా.. తాజాగా ఈ ప్రాజెక్ట్ రద్దయిందంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలపై చిత్రబృందం తాజాగా స్పందిస్తూ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా నిలిచిపోలేదని కేవలం తాత్కాలికంగా వాయిదా పడిందని స్పష్టం చేసింది. 2024 ఏప్రిల్‌లో ఎంతో గ్రాండ్‌గా ప్రకటించిన ఈ సీక్వెల్‌ను 2025లో ఏడాది విడుదల చేయాలని మేకర్స్ భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇది 2026 సమ్మర్‌కి పోస్ట్‌పోన్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. మరోవైపు చిత్ర దర్శకుడు గిరీష్ ప్రస్తుతం మమితా బైజు, నివిన్ పౌలీలతో కలిసి 'బెత్లెహెం కుటుంబ యూనిట్' అనే మరో ప్రాజెక్ట్‌లో బిజీగా ఉండటం కూడా ఒక కారణమని తెలుస్తుంది. తెలుగులో ఎస్.ఎస్. కార్తికేయ ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, చిత్ర నిర్మాణ సంస్థ 'భావన స్టూడియోస్' నుండి ఈ పుకార్లపై ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.